# నిపుణుల పాఠాలు

## గిరిజన యువతులకు గ్రూప్‌-2 శిక్షణ

# డిజిటల్ తరగతులు




నగరంలో ఉన్న గిరిజన యువత శిక్షణ కేంద్రం

**గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉద్యోగ సాధనకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా వంద మంది గిరిజన యువతులకు గ్రూపు-2లో శిక్షణ ఇస్తోంది. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానానికి సమీపంలో గిరిజన యువత శిక్షణ కేంద్రం ఇందుకు వేదికైంది.**

**-న్యూస్‌టుడే, బలగ (శ్రీకాకుళం)**

సీతంపేట ఐటీడీఏ, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ నిమిత్తం ఎంపిక చేసిన యువతులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఎల్సీడీ మానిటర్‌ల ద్వారా వీరికి పాఠాలు బోధిస్తున్నారు. నిపుణులైన అధ్యాపకులతో బోధన అందిస్తున్నారు. కరెంట్ అఫైర్స్, ఎకానమీ, పొలిటికల్ సైన్స్ అంశాల్లో వీరికి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణార్థులకు ప్రతి రెండు రోజులకొకసారి పరీక్షలు నిర్వహించి సామర్థ్య పెంపునకు కృషి చేస్తున్నారు. ఉచిత వసతి, భోజనం అందిస్తున్నారు.

### ఓ మంచి అవకాశం



ప్రభుత్వం ఆలోచన ఎంతో బాగుంది. శిక్షణలో మెలకువలు తెలుసుకున్నాను. మారుమూల ప్రాంతాలకు చెందిన మాలాంటి ఔత్సాహికులకు ఇది ఓ మంచి అవకాశం. శిక్షణలో నేర్చిన అంశాలను ప్రతిరోజూ మననం చేసుకుని.. సందేహ నివృత్తి చేసుకుంటున్నాను.

**-జి.పూజిత, టెక్కలి**

### గణితంపై భయం పోయింది



ఇలాంటి శిక్షణ తరగతులు నిర్వహించడం మా లాంటి యువతుల భవితకు పునాది. వాస్తవానికి నాకు కాంపిటేటివ్ మ్యాథ్స్ అంటే కొంత భయం. ఈ శిక్షణ తరగతుల వల్ల ఆ భయం పోయింది. ఇక్కడ తెలుసుకున్న విషయాలతో తప్పక ఉద్యోగాలు సాధించగలనన్న మనోధైర్యం నాలో పెరిగింది.

**-వై.లలిత కుమారి, మందస**



డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న శిక్షకుడు

### బోధనాంశాలు బాగున్నాయి



శిక్షణలో నేర్చిన అంశాలతో పాఠ్యాంశాలపై పట్టు కుదిరింది. ఇక్కడి బోధనాంశాలు ఎంతో బాగున్నాయి. బాగా కష్టపడి ప్రభుత్వ రంగంలో ఉన్నత ఉద్యోగం సాధించగలనన్న నమ్మకం ఈ శిక్షణ వల్ల కలిగింది.

**-ఎస్.లక్ష్మి, సీతంపేట**

### గ్రామీణ యువతకు ఎంతో మేలు



ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ గ్రామీణ యువతులకు ఆసరాగా నిలుస్తుంది. గ్రూప్స్ పరీక్షలకే కాకుండా ఇతర పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో నేర్పుతున్న విధానం బాగుంది. మరింత సాధన చేసి ప్రతిభకు మెరుగులు దిద్దుకుంటున్నాను.

**-బి.విక్టోరియా రాణి, మెళియాపుట్టి**

### అపోహలు తొలగిపోయాయి



శిక్షణ వల్ల పరీక్షపై అపోహలు తొలగిపోయాయి. భయం పోయింది. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడం ఎలాగో తెలిసింది. ప్రణాళిక ఉంటే.. అందుకు తగ్గ కార్యాచరణ సిద్ధం చేసుకుంటే ఎటువంటి లక్ష్యాలైనా సునాయాసంగా ఛేదించవచ్చని ఇక్కడి గురువులు ఉద్బోధించారు. ఇక్కడి శిక్షణ రానున్న కాలంలో ఎంతగానో ఉపయోగపడుతుంది.

**-నిర్మలాజ్యోతి, టెక్కలి మండలం గోపాలపురం**

### మంచి ఫలితాలు సాధిస్తారన్న నమ్మకం ఉంది



వివిధ పోటీ పరీక్షలకు గిరిజన ప్రాంత యువతులకు శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలను రూపొందించారు. ఇక్కడి విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించడం ఆనందంగా ఉంది. వీరంతా మారుమూల ప్రాంతాలకు చెందిన వారే. చక్కటి బోధన, తరగతి వాతావరణం కూడా అందుకు అనువుగా ఉండడంతో మంచి ఫలితాలు సాధిస్తారన్నది నా నమ్మకం.

**-ఎం.సన్యాసి నాయుడు, గ్రూప్‌-2 శిక్షణ ఇన్‌ఛార్జి, వైటీసీ**